# స్వార్థత్యాగి

శ్రీ తుర్గా శేషగిరిరావు

[ఈ రకం కధావిధానం (ప్లాటు) అపూర్వంగా కనుపించవచ్చు. కాని 'రాజు' లాంటి స్వార్థ త్యాగులు ప్రపంచములో అచ్చటచ్చట వున్నారని నిరూపించడముకోసము నా యీ ప్రయత్నము. ఇది 'విషాదాంతము' (tragedy) గాన సహృదయుల మనస్సు చివుక్కుమనిపించవచ్చును. అటువంటి వారు మన్నిస్తారని అనుకుంటున్నాను.

"ఒరేయ్! ఎప్పుడూ యిట్లా ఆలోచిస్తూ కూర్చుంటావేమిరా? 'బొంబేటాకీస్' వారి 'బంధన్' వచ్చిందిట వెళ్దాం వస్తావా?" అని అడిగాడు రాజు.

రామారావు ఏమీ జవాబివ్వకుండా ఆకాశం వైపు చూస్తూ కూర్చున్నాడు.

"నిన్నేరా, రామా! ఎప్పుడూ మందగొండిగా వుంటున్నావేమిటి? క్రిందటి సంవత్సరము నీ చలాకీ, ఉత్సాహము చూసినవాళ్లు, యిప్పుడు నిన్నీస్థితిలో చూచి గుర్తుకూడా పట్టలేరు. అట్లా మారిపోయినావు. నాదగ్గరకూడా దాపరికమేనా?"

"..............."


"వంట్లో బాగుండకపోతే యేడాక్టరునైనా Consult చేయరాదూ?"

రామారావు, రాజువైపు చూచి

"నా ఆరోగ్యానికేమీ లోపంలేదు" అని మెల్లగా జవాబిచ్చాడు.

"అట్లా అయితే ఎప్పుడూ దిగులుగా వుంటావెందుకురా? ఎటైనా షికారుకు వెళ్దాంరా!" అన్నాడు రాజు.

"రాజూ! నన్ను క్షమించు. ఈరోజున నామనస్సేమీ బాగుండలేదు. రేపు వెళ్దాం"



వ్యాసకర్త

"పోనీ! నీమనస్సులో వున్నది నాకుకూడా చెపితే కొంత మనశ్శాంతి కలుగుతుందేమో! నేనేమీ నీకు పరాయివాడిని కానన్న సంగతి నీకు వేరే చెప్పనక్కరలేదు" అని రాజు దిగులుగా రామంవైపు చూచాడు.

"ఇదిగో! రాజూ! ప్రపంచంలో నాకెవరైనా 'ఆప్తుడు' అని వుంటే, అది నీ వొక్కడివే. మనిద్దరికీ ఏవిధమైన సంబంధ బాంధవ్యాలు లేకపోయినా, ఈ రెండు సంవత్సరాలనుంచీ సొంత సోదరుడికన్నా ఎక్కువ ప్రేమతో, నా కష్టసుఖాలు నీవిగాభావించి ఆదరిస్తున్నావు. అటువంటి నీ స్నేహ వాత్సల్యమును మరచిపోయేటంత కృతఘ్నునిగా నన్ను తల్చబోకు" అని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు రామం.

"అబ్బే అదేమిటోయ్! రామం, నీవిషయములో నాకెప్పుడూ కించిత్తయినా అనుమానం లేదు... లే! కాఫీత్రాగి అటు కృష్ణ ఒడ్డున కొద్దిసేపు కూర్చుందాం" అని రామాన్ని చేయిపట్టుకొని మెల్లగా కాఫీహోటల్ వైపు తీసుకొని వెళ్లాడు రాజు.

రామారావు, రాజూ, బెజవాడ కళాశాలలో 'యింటరు' చదువుతున్నారు. ఇద్దరూ ఒకే గదిలో వుంటూ, ఒకే హోటలులో భోంచేస్తూ, చాల అన్యోన్యతతో, కలసి మెలసి వుంటున్నారు. రామారావు పేద

కుటుంబములోని వాడు. పైగా బాల్యములోనే తల్లి దండ్రులను పోగొట్టుకొన్న మందభాగ్యుడు.

రాజుమాత్రము కొద్దిగా స్థితిపరుడు. ఇతనికి వృద్ధురాలయిన తల్లితప్ప 'నా' అన్నవా వరూ లేరు. పాపం! రామారావు నిస్సహాయ స్థితిచూచి, అతనికి అవసరమైనప్పుడల్లా కొద్దో గొప్పో సహాయము చేస్తూ వుండేవాడు,

✻

రామం, రాజుకలసి కృష్ణ ఒడ్డున, ఒక యిసుక తిన్నెమీద కూర్చున్నారు. ముందు రాజు యిట్లా అన్నాడు.

"రామం! క్రిందటి నెలలో "నా వివాహం కనుక తప్పక నీవు మావూరు రావలసినది" అని నీ పేర రెండు వుత్తరాలు వ్రాసినా జవాబివ్వలేదు. పెళ్లికీ రాలేదు. అప్పుడు నామనస్సెంతక్షోభిల్లి పోయిందో ఎవరికి తెలుసు?...అప్పుడే అనుకున్నాను, నీవంట్లో కులాసాగా లేదేమోనని— నేను వచ్చినప్పటినుంచీ నీ పరిస్థితి కనిపెట్టుతోనే వున్నాను. ఏదో విషయంగురించి నీలో నీవు బాధపడ్తున్నావని గ్రహించాను. కాని అడిగితే ఏమనుకుంటావో అని జంకాను. నీస్థితిచూస్తే కొద్ది రోజులలో పిచ్చివాడివయి పోతావేమోనని భయమేస్తుంది. నీ మనశ్శాంతిని యింతగా కలచివేస్తున్న ఆ విషయాన్ని నేను వినకూడదా?" అని దీనంగా ప్రశ్నించాడు రాజు. ఈ చివరి వాక్యముతో రామం హృదయము ద్రవించి పోయింది. గభాలున రాజు రెండు చేతులు పట్టుకొని "రాజూ! నన్ను క్షమించు అనవసరముగా నిన్ను బాధపెడ్తున్నాను...నీతో చెప్పకూడని రహస్యా లేమున్నాయి నాకు?" అన్నాడు.

"అయితే ఎందుకిట్లా నీలో నీవు కుమిలి పోతున్నావ్?"

రామారావు యిట్లా చెప్పడం ప్రారంభించాడు:—

క్రిందటి వేసంగి శెలవల్లో మా మేనమామగారి వూరి వెళ్ళాను. అది చిన్నపల్లెటూరు. ఇంటిలో, మా మామయ్య, అత్తయ్య నేనూ, తప్ప యింకెవరూ లేరు.

మొదట్లో ఏమీ తోచేది కాదు. గాని, ఇంతలో ఒకవింత సంఘటన కలిగింది. మావాళ్ళింటి ప్రక్కయింట్లో ఆసామి యిల్లున్నది. ఆయన రెండో కూతురు పద్మ. సుమారు పదునాలుగేళ్లుంటాయి. పద్మ ప్రతి రోజూ సాయంత్రపు వేళ మా అత్తయ్యదగ్గరకు వచ్చి జడవేయించుకొని వెళ్లేది. ఆ అమ్మాయిని మాడటానికని, రోజూ నేను షికారుకు వెళ్లటంకూడా మానుకొని, కనిపెట్టుకొని కూర్చునేవాడిని. పద్మ కూడా, వచ్చేరావడంతోనే, 'నీకోసమే' నన్నట్లు నావైపు చూచేది. యిట్లా కొన్నిరోజులు గడిచింది...మా అత్తయ్యకూడా చాలా చలాకీ మనిషి. పద్మకు జడ వేస్తూ, "రామూ! చూచావా ఈ అమ్మాయిని ఎంచక్కా వుంది. ఈడూ, జోడూ, సరిపోయింది. నీకు యిష్టమైతే ఇప్పుడే 'మూడుముళ్లూ' వేయిస్తాను" అని వేళాకోళం ఆడేది.

పాపం! పద్మసిగ్గుతో తలవంచుకొని, క్రీగంటితో చూస్తూ మందహాసము చేసేది...

ఇంకోరోజున, పద్మ ఎందుకో మాయింటికి వచ్చింది. నేను అవతల గదిలో ఏదో పత్రిక చూస్తూ పడుకున్నాను. ఇంతలో మా అత్తయ్య, "పద్మం! ఏదీ, ఒక్క పాట పాడవే? నీపాట విని చాలా రోజులయింది" అని పద్మను బలవంత చేసింది. ఒక్క నిముషం ఆగి పద్మ

పలుకవేమి నా దైవమా, రామ,
పలుకవేమి నా దైవమా।
అలుగ కారణమేమిరా। నాతో॥ పలుక॥

అంటూ తన కిన్నెరకంఠంతో శ్రావ్యంగా పాడుతుంటే, నన్నే ఆ కీర్తనతో మేలుకొల్పుతున్నట్లు అనిపించింది నాకు...తరువాత మెల్లమెల్లగా పద్మతో పరిచయమైంది. కొన్నిరోజులిట్లా గడిచిపోయిన తరువాత ఒకరినివిడిచి ఒక్కక్షణము వుండలేనంత స్థితికూడావచ్చింది. ఇంతలో వేసంగి శెలవలు పూర్తి అయినాయి. అప్పటికే కాలేజి తెరచి రెండురోజులయింది. ఇంక పద్మను విడిచి వెళ్లక తప్పదు. ఎలాగయితేనేం మనస్సు రాయి చేసుకొని పద్మతో యీవిషయం చెప్పాను. అప్పుడు పద్మపడ్డ ఆవేదన యింతా అంతా కాదు.....చివరకు శాంతించి, యింటికి వెళ్లి తన 'ఫోటో' తీసుకొనివచ్చి, దానిని తన ప్రేమపూరిత హస్తాలతో నాకు బహూకరించింది. నా 'చిరునామా' కూడా తాను వ్రాసుకుంది...అదే ఆఖరు చూపు."

"ఏం! నీవు యిచ్చటకువచ్చిన తరువాత ఆమె మరణించిందా?" అని ఆదుర్దాగా ప్రశ్నించాడు రాజు.

"అబ్బే! ఆమె మరణించలేదు గాని జీవచ్ఛవమైంది... నేను చెప్పబోయేది శాంతంగా విను" అని మళ్ళీ యిట్లా చెప్పడం ప్రారంభించాడు రామం.—

'నేను అతి కష్టంమీద యిచ్చటకువచ్చి కాలేజిలో ప్రవేశించాను. గాని మనస్సంతా పద్మమీదే వుండేది...యింతలో నీదగ్గరనుంచి 'పెళ్లికి రమ్మ'ని ఆహ్వానము వచ్చింది. 'తప్పకుండా వెళ్లాల'ని నిశ్చయించుకున్నాను. కాని ఆమరునాడే పద్మదగ్గరనుంచి వుత్తరం వచ్చింది." అని జేబులోనుంచి ఒక కార్డుతీసి "రాజూ! యిది చదివితే నా హృదయావేదన అంతా నీకర్థమవుతుంది" అని రాజుచేతికిచ్చాడు.

ఆ కార్డుమీద యీ రెండే వాక్యాలు గజిబిజిగా గీకబడివున్నాయి.

"ఎల్లుండి నా వివాహము. మీ చరణదాసిని మరవవద్దు.

మందభాగ్యురాలగు
'పద్మ'

రామారావు కళ్ల నీళ్లుతుడుచుకొని మళ్ళీ ఇట్లా చెప్పాడు— 'ఆవుత్తరము చూచినప్పుడు నేనెంతగా బాధపడ్డానో నీవే వూహించుకో. యిక నీ పెళ్ళికి ఎట్లా వచ్చేది? అన్నాడు.

"ఏదీ, పద్మం ఫోటోను నన్నొకసారి చూడనియ్యి" అని అడిగాడు రాజు.

రామారావు జేబులోనుంచి అతి భద్రంగా పద్మ 'ఫోటో'ను బైటికితీసి రాజుచేతికిచ్చాడు. రాజు ఫోటోను చూచి తల పంకించాడు. యింతలో చీకటి పడటంవల్ల యిద్దరూ లేచి బయలుదేరారు.

❋

మరునాడు ప్రొద్దున, ఎందుకోగాని రాజు తన గదిలో మంచంమీద పడుకొని చాలాబాధపడుతున్నాడు. రామం అతనికి ఉపచారాలుచేసినా గుణం కనుపించకపోవటంవల్ల, డాక్టరుకోసము వెళ్ళాడు......డాక్టరు వచ్చి రాజును పరీక్షించి "ఇతడు ఏదో విషసంబంధమైన వస్తువు తిన్నాడు. బహుశా ఆత్మహత్యకు పూనుకొని వుంటాడు. ఇప్పటికే మించిపోయింది. చికిత్స చేసినా లాభంలేదు. కాని ఈ యింజక్షనువల్ల యీ రోజంతా జీవిస్తాడు" అని చెప్పి యింజక్షనుయిచ్చి వెళ్ళిపోయాడు...కొంతసేపటికి రాజు మెల్లగా రామారావును దగ్గరకు పిలిచి అతికష్టంతో "నీ పద్మను పెళ్లిచేసుకొని నిన్ను ద్రోహంచేశాను. ఆ పాపపరిహారార్థం నేను యీ ప్రపంచాన్ని వీడుతున్నాను. నా భార్యకు, మామగారికి, నా యీస్థితిని తెలియపర్చి, వారిని వెంటనే పిలిపించు" అని చెప్పాడు. ఇది విని రామారావు కొయ్యబారి క్రిందకూలబడిపోయాడు.

❋

రాజు భార్య అయిన పద్మ, అతని మామగారు ఆదుర్దాగా ప్రవేశించేటప్పటికి, రాజు మరణయాతన పడుతున్నాడు. చుట్టూ చాలామంది మూగి ఉపచారాలు చేస్తున్నారు. వారిలో రామారావుకూడా వుండటంచూచి, పద్మ తెల్లబోయింది...

రాజు అతికష్టంమీద, పద్మ చెయ్యిపట్టుకొని రామారావు చేతిలో పెట్టాడు. తరువాత ఆయాసపడుతూ మామగారితో యిట్లా చెప్పాడు.

"వీరిద్దరినీ యిదివరకే భగవంతుడు దంపతుల్ని చేసాడు. మరి మానవబలంకన్నా దైవబలం గొప్పది కదా! కనుక యిట్లా జరిగింది దీనికి మీరు అన్యథాచేస్తే పరలోకంలో నాఆత్మ శాంతించదు...రామూ! నీకు వేరే తిరిగి చెప్పనవసరము లేదనుకుంటాను. ఈపద్మను నీ ధర్మపత్నిగా స్వీకరించు...దీనికి అన్యథా జరిగితే నా ఆత్మశాంతిని చెడగొట్టినవాడవుతావు...యీ కాగితము తీసుకో...దీనిలో నా ఆస్తినంతయు నీకు చెందేటట్లు వ్రాసాను...నా ముసలితల్లి రక్షణభారముకూడా నీపైన పెట్టుతున్నాను...నాకోసము మీరెవ్వరూవిచారించవద్దు...పద్మ, రామూ, సుఖంగా జీవితయాత్ర సాగిస్తూవుంటే, చూసినా అంతరాత్మ సంతోషిస్తుంది. మీరు ఇందుకు భిన్నంగా ప్రవర్తించమని వాగ్దానం చెయ్యాలి" అన్నాడు. రాజు మామగారు, రాము, విచారంతో "నీవు చెప్పినట్లు ప్రవర్తిస్తాము" అని వాగ్దానము చేసారు.

"ఇక నేను నిశ్చింతగా... ప్రాణాలు...విడుస్తాను...మీ వాగ్దానాలు మాత్రం మరవకండి......శెలవు" అని కళ్లుమూసుకున్నాడు రాజు.